క్లుప్తంగా

బదిలీలకు వినతి

చుంచుపల్లి: ఐదేళ్లకు పైబడి ఒకే పంచాయతీలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయాలని కోరుతూ బుధవారం పలువురు కార్యదర్శులు కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని కార్యదర్శులు తెలిపారు. ఈ కార్యక్రుమంలో వంశీ కృష్ణ , దివాకర్, వెంకట్, బాలు, లక్ష్మీనారాయణ, సందీప్, విజయ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా గాంధీ

చుంచుపల్లి: లక్ష్మీదేవిపల్లి బీజేపీ మండల అధ్యక్షుడిగా మాలోత్ గాంధీని జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ నియమిస్తూ బుధవారం పార్టీ కార్యాలయంలో నియామకపత్ర అందజేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మాలోత్ గాంధీ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ అప్పజెప్పిన బాధ్యతలను వమ్ము చేయకుండా, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. సమన్వయంతో పని చేస్తూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేపడతామన్నారు.

విద్యుత్, ఇంధనాన్ని పొదుపు చేయాలి

ఇల్లెందు: ప్రతీ ఉద్యోగి విద్యుత్, ఇంధనాన్ని పొదుపు చేయాలని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... ఇంటి కిటికీలు, గాలి, వెలుతురు వచ్చేలా తెరిచి ఉంచాలని, ఎల్‌ఈడీ, ట్యూబులు వాడాలని ఎర్ర బల్బులు వాడరాదన్నారు. అవసరం లేని చోట విద్యుత్ వాడకం నిలిపివేయాలని సూచించారు. అనంతరం ఇల్లెందులో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన ఉద్యోగి వారసుడికి కారుణ్య నియామకం కోసం ముఖాముఖి నిర్వహించారు. ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య ఆధ్వర్యంలో సాక్షుల సమక్షంలో ఇంటర్వ్యూ నిర్వహించారు.

రైతు సంఘం నాయకుడి మృతిపై సంతాపం

జూలూరుపాడు: తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతా స్వరాజ్‌రావు మృతి తీరని లోటని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. జూలూరుపాడుకు చెందిన స్వరాజ్‌రావు అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందగా ఆయన మృతదేహం వద్ద భాగంతో పాటు సీపీఐ భద్రాద్రి, ఖమ్మం జిల్లాల కార్యదర్శులు ఎస్కే.సాబీర్‌పాషా, పోటు ప్రసాద్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు ఎర్ర బాబు, ఏపూరి బ్రహ్మం, ముత్యాల విశ్వనాథం , చంద్ర నరేంద్రకుమార్, నరాటి ప్రసాద్, లేళ్ల వెంకటరెడ్డి, దుద్దుకూరి మధుసూదన్‌రావు తదితరులు కూడా స్వరాజ్ మృతిపై సంతాపం తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు

ఇల్లెందు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ ప్రజలను ఇబ్బంది పెట్టే వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ బత్తుల సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం మాట్లాడుతూ.. ఇకపై పట్టణంలో షాపులన్నీ రాత్రి 10 - 30 గంటల్లోగా మూసివేయాలని, తెరిచి ఉంచితే యజమానులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే, రహదారులపై ఇష్టారాజ్యంగా తిరిగినా, గొడవలకు దిగినా సహించేది లేదని హెచ్చరించారు. అంతేకాక పేకాట, మట్కా ఆడేవారిని నియంత్రిస్తూ, గుట్కా అమ్మకాలను పూర్తిస్థాయిలో అరికడతామని సీఐ ఓ ప్రకటనలో తెలిపారు.

పక్కాగా.. సాగు లెక్క

- క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఏఈఓలు
- పంటల సాగు వివరాలు యాప్‌లో నమోదు

వానాకాలంలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాల సేకరణలో వ్యవసాయ అధికారులు నిమగ్నమయ్యారు. గ్రామాల వారీగా రైతులు ఏం పంటలు ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వాస్తవానికి పంట సాగు చేస్తున్నారా.. లేదా.. ఇలా అనేక అంశాలతో ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలను పరిశీలిస్తున్నారు. పంటల వారీగా వివరాలను సేకరించి ఉన్నతాధికారుల ఆదేశాల అనంతరం ఆన్‌లైన్‌లో సాగు లెక్కలను నమోదు చేస్తారు. సాగు విస్తీర్ణం దిగుబడులు పరిగణలోకి తీసుకొని కొనుగోలు కేంద్రాలు, గిట్టుబాటు ధరలు తదితర వాటిని నిర్ణయిస్తారు.


సర్వే చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఇల్లెందురూరల్: తొలకరి వర్షాలతో విత్తనాలు విత్తుకోవడం ప్రారంభించిన రైతులు ఆ తరువాత కురిసిన అడపాదడపా వర్షాలకు మండలంలో ఇప్పటికే 70శాతం మేర విత్తనాలు విత్తుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో విత్తన విక్రయాలను బట్టి సాగు విస్తీర్ణాన్ని గతంలో అంచనా వేసేవారు. దీనివల్ల క్రయవిక్రయాల సమయంలో ఇబ్బందులు ఏర్పడేవి. పంట సాగు నమోదు ఆధారంగానే భవిష్యత్ కార్యాచరణ రూపొందించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సాగు వివరాలను చాలామంది రైతులు నమోదు చేసుకోవడం లేదు. ఈ క్రమంలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత పరిస్థితులు పునరావృతం కాకుండా ఈసారి విత్తనాలు విత్తుకునే దశ నుంచే సాగు లెక్కను వ్యవసాయశాఖ అధికారులు ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఏఈఓలు నేరుగా రైతులను సంప్రదించి సాగు వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

నమోదు లేకుంటే ఇబ్బందులే..

వ్యవసాయ శాఖ చేపడుతున్న సర్వేలో రైతులు పంటల వివరాలు నమోదు చేసుకోకుంటే పంట విక్రయాలు, ఏదైనా ఉపద్రవం సంభవించినప్పుడు పరిహారం అందుకునేందుకు ఇబ్బందులు తప్పవని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాలలో ఏఈఓలు పర్యటించి రైతుల వారీగా సర్వే ప్రారంభించారు. రైతు పేరు, పట్టాదారు పాస్‌పుస్తకం నంబర్, సర్వే నెంబర్, సాగు విస్తీర్ణంతోపాటు వేసిన పంటలు, నీటి వసతి తదితర వివరాలు సేకరిస్తున్నారు.

రైతులకు మేలు..

వ్యవసాయ అధికారులు సేకరించిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తరువాత రైతులకు సమాచారం అందిస్తారు. ఎన్ని ఎకరాలు ఉంటే వాటిలో ఏఏ పంటలు సాగు చేశారనే సమాచారం యాప్‌లో పక్కాగా నమోదవుతుంది. గ్రామాల వారీగా రైతు పేరు, పట్టాదారు పాస్‌పుస్తకం, సర్వే నంబర్ తదితర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదై ఉంటాయి. వాటిని వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రింట్ తీసుకొని రైతు వారీగా సాగు చేసే పంటల వివరాలు, విత్తన రకాలు, నీటి వసతి, యంత్ర పరికరాలు, పశువుల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ తరహా వివరాల సేకరణ రైతుకు మేలు చేస్తుందని అధికారులు చెప్పుతున్నారు.

వ్యవసాయశాఖ అంచనా ప్రకారం మండలంలో సాగు విస్తీర్ణం...

మొక్కజొన్న 25వేల ఎకరాలు, పత్తి 13వేలు, మిర్చి 2వేలు, వరి 8వేలు, పెసర, మినుము, జొన్న తదితర పంటలు 1200 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతాయని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం విత్తన విక్రయాలను బట్టి గతేడాది కంటే మొక్కజొన్న సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, పత్తి స్వల్పంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక గడిచిన మూడేళ్లుగా వరుస నష్టాలతో సతమతమవుతున్న రైతులు ఈసారి పత్తి, మొక్కజొన్న సాగువైపు మళ్లడంతో మిర్చి సాగు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా అధికారులు లెక్కలేస్తున్నారు.

సాగు లెక్క ప్రారంభించాం...



క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను గణించడం ప్రారంభించాం. ఏఈఓలు గ్రామాల వారీగా పర్యటిస్తూ రైతుల సమక్షంలో వారు సాగు చేస్తున్న పంటల వివరాలు, సాగు విస్తీర్ణం, పట్టాదారు పాట్టాదార్ పాస్‌పుస్తకం నంబర్ తదితర వివరాలను నమోదు చేస్తున్నారు. రైతులందరూ సాగు వివరాలను పక్కాగా నమోదు చేసుకోవాలి. జాబితాలో పేరు ఉంటేనే పంట విక్రయాలు, నష్టపరిహారం సమయంలో మేలు జరుగుతుంది.

– సతీష్, ఏఓ, ఇల్లెందు మండలం

విద్యార్థి దశ నుంచే శ్రమించాలి


ఎంఈఓ, ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఇల్లెందురూరల్: నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు విద్యార్థి దశ నుంచే శ్రమించాలని ఎంఈఓ పిల్లి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని చల్లసముద్రం ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరం పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల అభినందన సమావేశం బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి వరకు ఉపాధ్యాయుల పర్యవేక్షణతోపాటు విద్యాబోధన కూడా సమర్థవంతంగా ఉంటుందని, భవిష్యత్ చదువులు విద్యార్థి అంకితభావం, పట్టుదలపై ఆధారపడి ఉంటాయని తెలిపారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో అలవర్చుకున్న క్రమశిక్షణను కళాశాలల్లో కూడా ప్రదర్శించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు హెచ్‌ఎం, ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో సర్టిఫికెట్ బ్యాగ్‌లను అందజేశారు.

లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోండి..



ధర్నా చేస్తున్న ఇఫ్టూ నాయకులు, కార్యకర్తలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను ఎత్తివేయాలని, రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి, రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్, గౌని నాగేశ్వరరావు మాట్లాడారు. బీజేపీ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్‌లను అమలు చేస్తామని ప్రకటించడం సరైంది కాదని విమర్శించారు. నాలుగు లేబర్‌కోడ్‌లను అమలు చేయమని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.సంజీవ్, ఎం.మల్లికార్జునరావు, యాసారపు వెంకన్న, డి.మోహన్ రావు, బి.వెంకటమ్మ, తొగర సామేలు, పి.వీరన్న, జి.నగేష్, ఆర్.నరసింహారావు, ఎ.అంజయ్య, ఎస్.వినోద తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు నిధులు విడుదల చేయండి

కొత్తగూడెంటౌన్: బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా ఎంపికైన విదేశీ ఉన్నత విద్యకు తక్షణమే నిధులు విడుదల చేయాలని బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు దండిబోట్ల రామాంజనకుమార శర్మ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వివేకానంద ఓవర్సీస్ పథకం ద్వారా ఎంపికైన వాళ్లు ఒక్కొక్కరికి రూ.20 లక్షలు చొప్పున 300 మంది ఉన్నారని తెలిపారు. అనుమతి లెటర్లు ఇవ్వడం జరిగిందని, ఎన్నికల ముందు రావాల్సిన నిధులు రాకపోవడంతో బ్రాహ్మణ విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు.

అటవీ భూఆక్రమణలపై చర్యలు తీసుకోండి


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

సుజాతనగర్: గరీబ్‌పేట గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దమ్మ గుడి సమీపంలో ఒక ఎకరం భూమి ఆక్రమణకు గురయిందని, చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం జిల్లా అటవీశాఖాధికారికి వినతిపత్రం అందజేశారు. చిట్టి రామవరానికి చెందిన ఓ వ్యక్తి మరికొందరి సాయంతో అటవీ భూమిని కబ్జా చేయాలని రాత్రికి రాత్రే దున్నినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కస్నబోయిన భద్రం, లక్ష్మణ్, బోడ రవికుమార్, పుల్లయ్య, రామ్మూర్తి, వెంకటేష్, సాయికుమార్, నున్నా లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆరు డైరెక్టర్ పోస్టులు ఐఎన్‌టీయూసీ కైవసం


విజేతలను అభినందిస్తున్న వర్క్‌షాపు ఎస్ఈ శ్రీకాంత్ తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా వర్క్ షాపులో బుధవారం జరిగిన కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో ఏడు డైరెక్టర్ పోస్టులకు గాను ఐదు జనరల్, ఒక మహిళా డైరెక్టర్ పోస్టును ఐఎన్‌టీయూసీ ప్యానెల్ గెలుచుకుంది. మిగిలిన ఒక డైరెక్టర్ పోస్టు ఏఐటీయూసీకి దక్కింది. సొసైటీలో 56 మంది సభ్యులకు గాను 52 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, సంగవీర ఐమంత్స్ 41 ఓట్లతో మొదటి స్థానంలో నిలిచాడు. అలాగే మెంగాని అశోక్, శ్రీకాంత్ శర్మ, బాబుద్దీన్, ఎస్.రామచందర్‌రావు గెలవగా, ఏఐటీయూసీ నుంచి బండ గౌరీ వరప్రసాద్ గెలిచారు. డైరెక్టర్లను వర్క్‌షాప్ ఎస్ఈ శ్రీకాంత్ అభినందించగా, నాయకులు రజాక్, ఆల్బర్ట్, రాజేశ్వరరావు, ఎండీ సత్తార్‌పాషా, వై.రవి, నాగమోహన్, రమేష్‌బాబు, భాను చందర్, యాకుబుద్దీన్, పవన్‌కుమార్, పాల్గొన్నారు.

నేడు ఆర్‌సీహెచ్‌పీలో... కొత్తగూడెం ఏరియా పరిధి రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌సీహెచ్‌పీ)లో కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. మొత్తం ఏడు డైరెక్టర్ పోస్టులు ఉండగా... ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ అన్ని పోస్టులకు, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఇండిపెండెంట్‌గా ఒక్కో పోస్టుకు పోటీ చేస్తున్నారు. కాగా, 70 మందికి ఓటు హక్కు ఉన్న నేపథ్యాన రిటర్నింగ్ అధికారిగా కోఆపరేటివ్ సొసైటీ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ వ్యవహరించనున్నారు.

తాగునీటికి రూ.74 కోట్ల కేంద్ర నిధులు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

చుంచుపల్లి: అమృత్ 2.0 పథకం ద్వారా కొత్తగూడెంలో తాగునీటి సరఫరా కోసం కేంద్రప్రభుత్వం రూ.74.68 కోట్ల నిధులు మంజూరు చేసిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ దేశంలోని ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో గతంలోనే అమృత్ 2.0 పథకం ప్రారంభించారని చెప్పారు. ఇందులో భాగంగానే కొత్తగూడెంకు సైతం నిధులు మంజూరు చేయగా, రాష్ట్రప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కేంద్రానికేమీ సంబంధం లేదని చెప్పడం గర్హనీయమన్నారు. ఈ సమావేశంలో పోడియం బాలరాజు, నోముల రమేష్, మాలోత్ గాంధీ, కల్లూరి రామారావు, శ్రీ రాంసాయి కిరణ్, గుగులోత్ శంకర్, బియ్యని విజయ్, మిర్యాల రాధాకృష్ణ, బాడిశ శివాజీ, రాజేష్ పాల్గొన్నారు.

రైతులతో సమావేశం


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య

జూలూరుపాడు: సీతారామ లింక్ కెనాల్ నిర్మాణంతో భూములు కోల్పోతున్న జూలూరుపాడు, వినోభానగర్ గ్రామాలకు చెందిన రైతులతో పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య వినోభానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. జూలూరుపాడు - ఏన్కూరు మధ్య నిర్మించే సీతారామ లింక్ కెనాల్‌తో 23 మంది రైతులకు చెందిన 30 ఎకరాల భూమి కోల్పోతున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య మాట్లాడుతూ... సీతారామ లింక్ కెనాల్ నిర్మాణంతో భూములు రైతులకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. అభ్యంతరాలు ఉంటే పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలని రైతులకు సూచించారు. అనంతరం రైతుల పేర్లు, కెనాల్ కింద కోల్పోతున్న భూమి విస్తీర్ణం తదితర వివరాలను డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం సిబ్బంది నమోదు చేసుకున్నారు. జూలూరుపాడు తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఎస్‌ఎల్‌డీసీ డీటీ ఎలిజిబెత్, గిర్దావర్ ఎం .తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓను కలిసిన గ్రామీణ వైద్యులు


డీఎంహెచ్‌ఓను కలిసిన గ్రామీణ వైద్యులు

కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి భాస్కర్‌నాయక్‌ను బుధవారం గ్రామీణ వైద్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వారి సమస్యలపై వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రస్తుతం గ్రామీణ వైద్యుల మీద జరుగుతున్న దాడులను వివరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ గ్రామీణ వైద్యులకు తగు సూచనలు, సలహాలు చేశారు.

ఎవరూ హైపవర్‌ఫుల్ యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ వాడరాదని, ఎవరైనా పబ్లిక్ కంప్లైంట్ చేస్తే తగు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు, గౌరవ అధ్యక్షుడు పీవీ రావు, ఆఫీసు ఇన్‌చార్జ్ జీవీ రావు, కోశాధికారి రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

రవాణా అడ్డుకున్నందుకే ఆరోపణలు

పాల్వంచ: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నందుకే తమపై కొందరు వ్యక్తులు నిరాధార ఆరోపణలు చేస్తూ తమ శాఖ ప్రతిష్ట దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారని పాల్వంచ ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్ కె.దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. మణుగూరుకు చెందిన పీవీ చారి ఇసుక కాంట్రాక్టర్ గత నెలలో లారీ ఇసుక తరలింపుకు అనుమతులు తీసుకుని రెండో ట్రిప్ కూడా తరలిస్తున్నట్లు నిర్ధారించుకుని సీజ్ చేశామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తమపై దౌర్జన్యం చేశారని, తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడన్నారు. దీనిపై తమ దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని అందుకే రూ.50వేల ఫైన్ వేశామని చెప్పారు. ఇసుకను తమ శాఖ కూడా పట్టుకునే అధికారం ఉందన్నారు. తమ సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు చూపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గోర్ బంజారా సమ్మేళనానికి తరలిరండి..

టేకులపల్లి: గిరిజన లంబాడీల హక్కుల సాధన కోసం బంజారాలు కదం తొక్కాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) సమన్వయ కమిటీ కోకన్వీనర్, న్యాయవాది రమేష్ నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లిలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. జూలై 1న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే గోర్ బంజారా జాతీయ సమ్మేళనం, లంబాడీ హక్కుల పోరాట సమితి 28వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు లంబాడీ బిడ్డలు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్ నాయక్, మోహన్ నాయక్, నాగేశ్వరరావు నాయక్, మాలోత్ రమేష్, రవి, సురేష్, హరి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌ల వేలం రద్దు చేయాలి


మాట్లాడుతున్న కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం ప్రక్రియ రద్దు చేయకపోతే ఉద్యమాలు తప్పవని, తెలంగాణ సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. కొత్తగూడెం ఏరియా పీవీకే-5 షాఫ్ట్ గని ఆవరణలో ఏర్పాటు చేసిన పిట్ సమావేశం, కొత్తగూడెం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి తలమానికమైన సింగరేణి బొగ్గు గనులను వేలం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, మొన్నటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి గనులను ప్రవేటీకరించే ప్రసక్తే లేదని, సింగరేణి సంస్థకు పూర్వవైభవం తీసుకొస్తామన్న రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీని నిలపెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, వర్కింగ్ ప్రసిడెంట్ గడిపెల్లి కృష్ణప్రసాద్, కామెర గట్టయ్య, ఎల్.విశ్వనాథం, గౌని నాగేశ్వరరావు, మల్లెల రామనాథం, చార్వాక, మిట్టపెల్లి రాజ్‌కుమార్, నీరటి రాజన్న, జీ.రమేష్, అనిల్‌రెడ్డి, ఆంజనేయులు, ఆసిఫ్, రాజిరెడ్డి, మల్లికార్జున్‌రావు, అలీమొద్దిన్, బోనాల శ్రీనివాస్, డి.రాజ్‌కుమార్, ఎం.అశోక్, యూసూబ్‌బాబా పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో....

సింగరేణి సర్వే చేసిన బొగ్గు బ్లాక్‌లు సింగరేణికే కేటాయించాలని, ఈ బ్లాక్‌ల వేలం నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ హయాంలో కేంద్రం నాలుగు బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్‌పరం చేసిందని, మంత్రి కిషన్‌రెడ్డి సింగరేణి బ్లాక్‌లను వేలం పెట్టటం భావ్యం కాదన్నారు. ఈ గనులపై ఆధారపడిన లక్షలాది కుటుంబాలు వీధిన పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు సత్యనారాయణ, భుక్యా రమేష్, కందుకూరి లక్ష్మి, జునుమాల నగేష్, రాజు, బాలకృష్ణ, ప్రశాంత్, సతీష్, సలీమ్, జహీన, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లను వేలంపాటలో ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని, ఈ చర్యను విరమించుకుని సింగరేణికి అప్పగించాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో నజీర్ అహ్మద్ మాట్లాడారు. సింగరేణికి బొగ్గు బ్లాక్‌లను అప్పగించాలని, సంస్థను కాపాడాలని కోరారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉంటే వేలంను రద్దు చేయించాలని కోరారు. ఇటీవల జరిగిన ఏఐటీయూసీ జిల్లా మహాసభలో ఇల్లెందుకు చెందిన నేతలు సారయ్య, శంకర్, నజీర్ అహ్మద్, బంధం నాగయ్య జిల్లా కార్యవర్గంలోని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, కౌన్సిలర్ కుమ్మరి రవీందర్, మోజేష్, బొల్లి కొమురయ్య, సూర్యప్రకాష్, ఈర్ల రవి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలం ఆపాలి...

కేంద్ర ప్రభుత్వం తక్షణమే బొగ్గు గనుల వేలంపాటను రద్దు చేసి సింగరేణికి కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌ఏ నబీ కోరారు. బుధవారం ఇల్లెందులో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని నిరసిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్, కృష్ణ, మోహన్‌రావు, కాంతమ్మ, అబ్బాస్, జనార్ధన్ రాజు, రాజమౌలి, నాగరాజు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజంగా మారుద్దాం..


ఇల్లెందు: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మాదకద్రవ్యాలు పెను ప్రమాదకరమైనవని, వాటిని ఎవరైనా వాడితే అనారోగ్యం కొని తెచ్చుకున్నట్లేనని పోలీసు, వైద్యాధికారులు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కూడళ్లలో మానవహారం నిర్మించారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ... ప్రభుత్వం డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని కంకణం కట్టుకుందన్నారు. యువత, విద్యార్థులు యాంటి డ్రగ్స్ సైనికులుగా మారాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్


పాల్వంచ: ప్రతిజ్ఞ చేస్తున్న డీఎస్పీ సతీశ్‌కుమార్, సీఐ, ఎస్ఐలు


టేకులపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది


పాల్వంచరూరల్: మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య


జూలూరుపాడు: మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి